తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక


# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

మంగళవారం | 7 జూలై 2026

పేజీలు : 08

మంత్రి మాట్లాడుతూ, పట్టణాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి, సుందరీకరణ పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన జీవన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులతో స్థానిక ప్రజలతో పాటు వాహనదారులకు కూడా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

# పట్టణ ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట

## గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- షాబాద్, చేవెళ్లలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే యాదయ్య
- రైతులతో ముఖాముఖి.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**షాబాద్ / చేవెళ్ల, జూలై 6 (జనం సాక్షి):**

పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం షాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో, సర్దార్ నగర్ వ్యవసాయ మార్కెట్‌లో కార్యాలయ భవనం, రెండు కవార్డు షెడ్యూలు, ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా చేవెళ్ల మండల, మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనులకు కూడా మంత్రి, ఎమ్మెల్యే శంకుస్థాపనలు నిర్వహించారు.

రైతుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ముఖ్యంగా చేవెళ్ల నియోజకవర్గ



రైతులు పువ్వులు, కూరగాయల ఉత్పత్తిలో రాష్ట్రానికి విశేష సేవలందిస్తున్నారని కొనియాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యవసాయ మార్కెట్ నిర్మాణం చేపట్టడం రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న రంగారెడ్డి జిల్లాలో పరిశ్రమల మిగితా 2లో

## పేదల గుడిసెల కూల్చివేతలు ఆపాలి.. ప్రతి గుడిసెకు పట్టా ఇవ్వాలి..

- ఇందిరాపార్క్ వద్ద వామపక్షాల మహాధర్నా
- ప్రభుత్వానికి కమ్యూనిస్టు పార్టీల హెచ్చరిక



లోపలి పేజీలో

## ఉస్మానియా బిస్కెట్ల యూనిట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీ

- ఉప్పల్‌లో పరిశుభ్రత, కీటక నియంత్రణ, ప్యాకేజింగ్‌లో పలు లోపాలు
- యాజమాన్యానికి మెరుగుదల నోటీసు
- వినియోగదారుల ఆరోగ్య రక్షణకు కఠిన చర్యలు
- నిర్ణీత గడువులో లోపాలు సరిదిద్దాలి



## ఘట్కేసర్ పరిధిలో 'నేను సైతం 2.0' కార్యక్రమం

- 100 సీసీటీవీ కెమెరాల ప్రారంభం
- ప్రజల భాగస్వామ్యంతో భద్రత మరింత బలోపేతం
- నేరాల నియంత్రణ, శాంతిభద్రతలకు కీలకం
- 24 గంటల నిరంతర నిఘా లక్ష్యం



లోపలి పేజీలో




## కార్మిక హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలు

- 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి 8 గంటల పని
- విధానాన్ని కొనసాగించాలి ఏఐటీయూసీ నేతలు
- ఏఐటీయూసీ, బిసి ల మండల మహాసభలు
- నూతన కమిటీలు ఏకగ్రీవ ఎన్నిక

లోపలి పేజీలో



## ఉపాధ్యాయుల భోజన పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి

- ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు, పీఆర్సీ చెల్లించాలి
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్

**తాండూరు జులై 6(జనంసాక్షి) :** ఉపాధ్యాయులు, కాలేజీల బోధన, బోధనేతర సిబ్బందికి ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని ప్రభుత్వం ఆలోచించడం పూర్తిగా అవాస్తవ ప్రాధాన్యతలకు నిదర్శనమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒకవైపు రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆరు డీఏలు, పీఆర్సీ అమలు కాక, పెండింగ్ బకాయిలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి రావాల్సిన వేతన ప్రయోజనాలు, డీఏలు, పీఆర్సీ, ఇతర బకాయిలు చెల్లించకుండా, ఉచిత మిగితా 2లో

# పేదల గుడిసెల కూల్చివేతలు ఆపాలి.. ప్రతి గుడిసెకు పట్టా ఇవ్వాలి




**ముషీరాబాద్, జూలై 6 (జనం సాక్షి):** రాష్ట్రంలో పేదల గుడిసెల కూల్చివేతలను తక్షణమే నిలిపివేసి, ప్రతి గుడిసెకు పట్టా, అర్హులైన ప్రతి నిరుపేదకు ఇల్లు ఇవ్వాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లోని ఇందిరాపార్క్ వద్ద సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఎంసీపీఐ, ఎంసీపీఐ(యూ), ఎస్‌యూసీఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ... పేదల శ్రమతోనే దేశ సంపద సృష్టించబడుతోందని, అలాంటి పేదల జోలికి వస్తే ఏ ప్రభుత్వమూ బతికి బట్టకట్టదని హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న గుడిసెల కూల్చివేతలను తీవ్రంగా ఖండిస్తూ, ల్యాండ్ మాఫియా ఆక్రమణలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'హైడ్రా' పేరుతో పేదలను ఇబ్బందులకు గురి చేయకుండా, అక్రమంగా ప్రభుత్వ భూములు ఆక్రమించిన పెద్దలపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇళ్ల హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. గుడిసెల కూల్చివేతలు కొనసాగితే బుల్డోజర్లకు ఎదురొడ్డి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ, పేదలకు ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు అదే పేదల గుడిసెలను కూల్చివేయడం దారుణమని విమర్శించారు. అవసరమైతే న్యాయపోరాటంతో పాటు పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈ.టి. నరసింహా, సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వర్లు, ఇతర వామపక్ష నాయకులు మాట్లాడుతూ పేదల ఇళ్ల కూల్చివేతలను వెంటనే నిలిపివేసి ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీలు ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లు ఉంచాయి. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల్లో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి ఇంటి పట్టా ఇవ్వాలని, ఇల్లు లేని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు లేదా ఇంటి స్థలం కేటాయించాలని, పోడు భూముల సాగుదారులకు పెండింగ్ లేకుండా పట్టాలు పంపిణీ చేయాలని కోరాయి. ప్రభుత్వం తక్షణమే చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వామపక్ష నాయకులు హెచ్చరించారు.

# ఘట్కేసర్ పరిధిలో 'నేను సైతం 2.0' కార్యక్రమం

**ఘట్కేసర్, జూలై 6 (జనం సాక్షి):** ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘట్కేసర్, ఎదులాబాద్, ఔషాపూర్, కొండాపూర్ గ్రామాల్లో "నేను సైతం 2.0" కార్యక్రమంలో భాగంగా 100 సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల భద్రత, శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని పోలీసులు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఇళ్లు, వ్యాపార సంస్థలు, కాలనీలు, గ్రామాలను మరింత సురక్షితంగా మార్చుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అవగాహన కల్పించారు. "ఒక సీసీటీవీ కెమెరా.. వంద మంది పోలీసులతో సమానం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రతి ప్రాంతంలో నిరంతరం నిఘా పెట్టడం సాధ్యం కాకపోయినా, సీసీటీవీ కెమెరాలు 24 గంటలూ నిరంతరాయంగా పనిచేస్తూ నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. సీసీటీవీ కెమెరాల వల్ల నేరాల నివారణకు దోహదపడటంతో పాటు, దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటన ల్లో నిందితులను త్వరగా గుర్తించేందుకు బలమైన సాక్ష్యాధారాలు లభిస్తాయని తెలిపారు. కెమెరాలు ఏర్పాటు చేసుకునే సమయంలో నాణ్యమైన పరికరాలనే ఎంపిక చేసుకోవాలని, రాత్రివేళల్లో స్పష్టమైన చిత్రాలు రికార్డు చేసే నైట్ విజన్, మోషన్ సెన్సార్ వంటి సదుపాయాలు ఉన్న కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. కెమెరాల దిశ ప్రజా భద్రతకు ఉపయోగపడేలా ఉండాలని, ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. "నేను సైతం 2.0" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి యజమాని, వ్యాపారవేత్త, కాలనీ సంక్షేమ సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకో వాలని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు ప్రభాకర్ రెడ్డి, శేఖర్, రాఘవేంద్ర, హీనా తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టణ ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట

ఏర్పాటుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, పరిశ్రమల స్థాపనతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. చందనవెల్లి ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి రైతుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని, భూసేకరణ అంశాల్లో రైతుల ప్రయోజనాలు పరిరక్షించేలా జిల్లా యంత్రాంగానికి తగిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.రైతులకు డీఏపీ ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవా లని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో అవసరమైన మేరకు డీఏపీ ఎరువులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఎరువుల పంపిణీకి సంబంధించిన ఆన్‌లైన్ వ్యవస్థలో ఉన్న స్వల్ప సమస్యలను పరిష్కరించి, టైమ్ స్లాట్ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి రైతులకు అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కిరణ్మయి, సర్దార్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ నగర్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు, షాబాద్ సర్పంచ్ గుండాల అశోక్, ఉపసర్పంచ్ దండు రాహుల్ గుప్తా, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల భోజన పథకంపై ప్రభుత్వం పునరాలోచించాలి

భోజనాల పేరుతో కొత్త పథకాలు తీసుకురావడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. బకాయిలు చెల్లిస్తే వారు తమ ఇంటి నుంచే భోజనం చేసి విధులకు హాజరవుతారు రాజ్ కుమార్ అన్నారు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందన్నారు. దాదాపు 430 ప్రభుత్వ కళాశాలల్లో చాక్ పీస్‌లు, బోధనా సామగ్రి వంటి కనీస అవసరాలకే నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్న పరిస్థితిలో, ఉచిత భోజన పథకానికి నిధులు వెచ్చించడం ఎంతవరకు సమం జసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.కాబట్టి ఉపాధ్యాయులు, బోధన మరియు బోధనేతర సిబ్బందికి ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే ప్రతిపాదనను తెలంగాణ ప్రభు త్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆ నిధులను ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి, పెండింగ్ బకాయిల చెల్లింపులకు వినియోగించాలని రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజా కవి బలరాం చారీ రచించిన పుస్తకాల ఆవిష్కరణ

**శామీర్ పేట్, జులై 06(జనం సాక్షి) :** కేశవరం గ్రామానికి చెందిన మేడోజ్ బలరాం చారి ప్రజాకవి రచించిన పుస్తకాలు ఉద్దమర్రి గ్రంథా లయానికి మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడోజి బలరాం కేశవరం గ్రామ నివాసి కవిగా గుర్తింపు పొందడం గత గ్రామీణ వాతావరణ స్థితిగతులను వర్ణించడంలో సిద్ధ హస్తుడని, ఇంకా ఇంకా ఇలాంటి పుస్తకాలు ఎన్నో ప్రజాకవిగా గుర్తింపు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు నట్లు తెలియజేశారు.ఈ కార్య క్రమంలో పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, నెల్లూరు సింగిరెడ్డి మల్లారెడ్డి, సింగిరెడ్డి నారాయణరెడ్డి, మైసయ్య, రైమన్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల సాధనకు రాజీలేని పోరాటాలు




సీపీఐ హయత్‌నగర్ మండల కార్యాలయంలో సోమవారం ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం (బిఓసి) ల మండల నిర్మాణ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ మహా సభలకు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి మోటే నరసింహా, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, మోటే నరసింహా కార్మిక సంఘం జెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. కార్మికులు ఎన్నో ఏళ్ల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మిక హక్కులపై దాడి అని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల హక్కైన 8 గంటల పని విధానాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే దేశవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహాసభల్లో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడిగా చెంది రాము, కార్యదర్శిగా గోల్కొండ నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం (బిఓసి) మండల అధ్యక్షుడిగా శ్రీను, కార్యదర్శిగా పేరుమల్ల సామెల్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, సీపీఐ హయత్‌నగర్ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి తో పాటు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉస్మానియా బిస్కెట్ల యూనిట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీ

**ఉప్పల్, జూలై 6 (జనం సాక్షి):** ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహార ఉత్పత్తులు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న సాధారణ తనిఖీల్లో భాగంగా ఉప్పల్‌లోని గోల్డెన్ ఫుడ్స్ (ఉస్మానియా బిస్కెట్లు) తయారీ యూనిట్‌పై ఆహార భద్రతా అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తయారీ యూనిట్‌లో పరిశుభ్రత, ముడి పదార్థాల నిల్వ, తయారీ విధానాలు, ప్యాకేజింగ్, కార్మికుల వ్యక్తిగత పరిశుభ్రత, కీటక నియంత్రణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించగా పలు లోపాలు వెలుగులోకి వచ్చాయి.

తనిఖీల్లో తయారీ యూనిట్‌లో తగినంత వెలుతురు లేకపోవడం, కీటకాలు లోనికి రాకుండా ఉండేందుకు ఏర్పాటు చేయాల్సిన రక్షణ జాలీలు లేకపోవడం, ప్రాంగణమంతా ఈగల బెడద అధికంగా ఉండటం అధికారుల దృష్టికి వచ్చింది. అలాగే కీటక నియంత్రణకు సంబంధించిన నిర్వహణ రికార్డులు, పత్రాలు అందుబాటులో లేకపోవడం కూడా గుర్తించారు.

అదేవిధంగా తయారీ యూనిట్‌లో పనిచేస్తున్న కార్మికులు వ్యక్తిగత పరిశుభ్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో పాటించడం లేదని, ముడి పదార్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిల్వ చేయకపోవడంతో పాటు బిస్కెట్ల తయారీ, ప్యాకేజింగ్ ప్రక్రియలు కూడా ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని అధికారులు గుర్తించారు. ఈ లోపాలు వినియోగదారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకూడదని, వినియోగదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం-2006 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని యాజమాన్యానికి సూచించారు.

తనిఖీల్లో గుర్తించిన అన్ని లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశిస్తూ యాజమాన్యానికి మెరుగుదల నోటీసు జారీ చేశారు. నిర్దేశించిన గడువులోగా లోపాలను సరిచేయని పక్షంలో చట్టపరమైన చర్యలు




తీసుకోవడంతో పాటు మరోసారి తనిఖీలు నిర్వహిస్తామని ఆహార భద్రతా అధికారులు హెచ్చరించారు. అధికారులు చేపడుతున్న ఈ తరహా ఆకస్మిక తనిఖీలు ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు.

# దివ్యాంగులకు అండగా ఉండడమే అంతిమ లక్ష్యం

- **హెలెన్ కెల్లర్ విద్యాసంస్థలో వీడ్కోలు వేడుకలు : చైర్మన్ పఠాన్ ఉమర్ఖాన్**



**మల్కాజిగిరి జూలై 6 (జనంసాక్షి) :** హెలెన్ కెల్లర్ విద్యాసంస్థలో స్పెషల్ ఎడ్యుకేషన్ 2024 బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని 2025 బి.ఎడ్ హియరింగ్ ఇంపైర్‌మెంట్ రెగ్యులర్ కోర్స్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత పటాన్ ఉమర్ ఖాన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధంతో, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆర్ సిఐ గుర్తింపుతో నడుస్తున్న ఈ బి.ఎడ్ స్పెషలైజేషన్ కోర్సు ఎంతో విశిష్టమైనదని, ఈ కోర్సు పూర్తి చేసి ఆర్సీఐ లైసెన్స్ పొందిన వారు దివ్యాంగ, వినికిడి లోపం ఉన్న పిల్లల ప్రత్యేక అవసరాలను గుర్తిస్తూ, వారికి స్పీచ్ థెరపీ, ప్రత్యేక బోధనా పద్ధతుల ద్వారా శిక్షణ ఇచ్చి సమాజ ముఖ్యధారలో కలపాలని పిలుపునిచ్చారు. సేవా నిరతితో మరింత మంది విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరి దివ్యాంగులకు అండగా నిలవడమే అంతిమ లక్ష్యం కావాలన్నారు. ఆడియోలజీ అండ్ స్పీచ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ కం డైరెక్టర్ డాక్టర్ ఆర్ముగం, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు ప్రణాళికలపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థులు తమ కోర్సు కాలం నాటి అనుభవాలను పంచుకుంటూ ఆటపాటలతో ఆహుతులను అలరించారు. ఈ వేడుకలో ఆడియోలజీ విభాగం డాక్టర్ శ్రీవిద్య, స్పీచ్ డిపార్ట్‌మెంట్ సుసన్, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



**చేవెళ్ల, జూలై 06 (జనంసాక్షి):** భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి వారి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు, చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ సమాజం లో అణగారిన, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని కృషి చేసిన మహనీయులు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని దేశ సేవలో విశేష పాత్ర పోషించారు. సమానత్వం, సామాజి క న్యాయం, విద్య, ప్రజాసేవ అనే విలువలను ఆచరణలో చూపించిన గొప్ప నాయకుడు వారి ఆశయాలు ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రతి ఒక్కరూ వారి మార్గదర్శకత్వాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ సర్పంచ్ ప్రస్తుత కౌన్సిలర్ బండారి శైలజాఆగి రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్ లు పైండ్ల మధుసూదన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచులు టేకులపల్లి శ్రీనివాస్, గంగి యాదయ్య, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు రెడ్డి శెట్టి మధుసూదన్ గుప్తా, బిజెఆర్ యూత్ అధ్యక్షులు కొజ్జంకి యాదయ్య, నాయకులు గిరిధర్ రెడ్డి, కవ్వాడి రాజావర్ధన్ రెడ్డి, పీసరి దామోదర్ రెడ్డి, బుర్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# ఓఆర్ఆర్‌పై లారీని ఢీకొన్న కారు.. యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

**శంషాబాద్,జూలై6(జనంసాక్షి) :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ పెద్దగోల్కొండ ఎగ్జిట్-15 సమీపంలో సోమవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి ప్రకారం తూర్పు గోదావరి జిల్లా (కాకినాడ)కు చెందిన చల్లా మనోహర్ (25) ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామంలో జరిగిన నిశ్చితార్థ కార్యక్రమానికి వెళ్లి తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా, వారు ప్రయాణిస్తున్న కారు ఓఆర్ఆర్‌పై ముందుగా వెళ్తున్న గుర్తుతెలియని లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న మనోహర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న రాఘవేంద్ర ప్రసాద్, ఆయన భార్య భవాని, రెండేళ్ల కుమారుడు కూడా ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో భవానికి గాయాలు కావడంతో తొలుత శంషాబాద్‌లోని ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. గుర్తుతెలియని లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ పోలీసులు తెలిపారు.

# ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని పరామర్శించిన మాజీ మంత్రివర్యులు హరీష్ రావు

**నిజాంపేట్ జూలై 6 (జనం సాక్షి) :** వరంగల్ కన్నెపల్లి రిజర్వాయర్ పర్యటనకు వెళ్తున్న నేపథ్యంలో మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శంభీపూర్‌లోని నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించిన మాజీ మంత్రివర్యులు హరీష్ రావు ... ఈ సందర్భంగా వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు



# క్వాంటమ్ ఎనర్జీ-హీరో ఫిన్ కార్ప్ భాగస్వామ్యం

**ఖైరతాబాద్, జూలై 06 (జనం సాక్షి) :** ఎలక్ట్రిక్ స్కూటర్ తయారీ సంస్థ క్వాంటం ఎనర్జీ, ప్రముఖ ఎన్.బి.ఎఫ్.సి హీరో ఫిన్ కార్ప్ తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు క్వాంటమ్ ఎనర్జీ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి చుక్కపల్లి సోమ వారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హీరో ఫిన్కార్ప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అభిమన్యు ముంజల్ తోకలసి ఆయన మాట్లాడుతూ ఈ ఒప్పందంతో కస్టమర్లకు తక్షణ ఈఎంఐ గణన, పూర్తిగా డిజిటల్ లోన్ ప్రాసెస్, సరసమైన వడ్డీ రేట్లు, సౌకర్యవంతమైన రీపేమెంట్ ఎంపికలతో ఎలక్ట్రిక్ స్కూటర్ల కొనుగోలు మరింత సులభతరం కానుందని తెలిపారు. ఈ భాగస్వా మ్యం ద్వారా ఎలక్ట్రిక్ మొబిలిటీని మరింత మంది కి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వేగవంతమైన, పారదర్శక ఫైనాన్సింగ్ ద్వారా మ రింత మంది భారతీయులు ఎలక్ట్రిక్ వాహనాలను స్వీకరించేందుకు ఇది దోహద పడుతుందని పేర్కొన్నారు.

# బోనాల ఉత్సవ ఖర్చులకు దరఖాస్తులు చేసుకోవాలి

**ముషీరాబాద్, జూలై 6 ( జనం సాక్షి):** ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని అమ్మ వారి ఆలయాల బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి అందించే ఆర్థిక సాయానికి గాంధీనగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని బీఆర్ఎస్ మీడియా ఇన్ చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోనాల ఉత్సవాలకు నియోజకవర్గం లోని అన్ని డివిజన్లలోని దేవాలయ కమిటీ సభ్యులు ఈ నెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆలయ లెటర్హెడ్, ఆర్థిక సహాయం వినతిపత్రం, ఆలయ ఫొటోలు, బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్, పాత చెక్ జిరాక్స్ తదితర పత్రాలను సమర్పించాలని, వివరాలకు సెల్ నెంబర్ 93922 22117కు సంప్రదించాలని సూచించారు.

# రియాద్‌కు రోజువారీ విమాన సేవలు ప్రారంభించిన ఫ్లైదీల్




**శంషాబాద్,జూలై6(జనంసాక్షి) :** సౌదియా గ్రూప్‌కు చెందిన తక్కువ ధరల విమానయాన సంస్థ ఫ్లైదీల్ భారత మార్కెట్లోకి అడుగుపెడుతూ హైదరాబాద్-రియాద్ మధ్య రోజువారీ నేరుగా విమాన సర్వీసులను సోమవారం ప్రారంభించింది. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న తొలి విమానానికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ జిహెచ్ఐఏఎల్ సీఈఓ కదిర్ కదిరవన్, ఫ్లైదీల్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ లాయిడ్ మిస్కిట్టా, ఫ్లైదీల్ హెడ్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ అబ్దుల్రహ్మాన్ అలషీద్, జీఎంఆర్‌కు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొని తొలి విమానానికి స్వాగతం పలికారు. ఎయిర్‌బస్ ఏ320 విమానాలతో హైదరాబాద్-రియాద్ మార్గంలో ప్రతిరోజూ సర్వీసులు నడవనున్నాయి. ఈ కొత్త సర్వీసుతో భారత్-సౌదీ అరేబియా మధ్య వైమానిక అనుసంధానం మరింత బలోపేతం కావడంతో పాటు ప్రవాస భారతీయులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులకు సౌకర్యవంతమైన ప్రయాణ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని అధికారులు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మల్కాజిగిరి జూలై 6 (జనంసాక్షి) : ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఉత్తీర్ణులు కావాలని వినాయక నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆనంద్‌బాగ్ తాళ్ళబస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో త్రిశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి అనుకున్న లక్ష్యాల ను చేరుకోవాలని సూచించారు, అనంతరం సంస్థ అధ్యక్షురాలు సూర్యకుమారి మాట్లాడుతూ త్రిశక్తి సేవా సమితి విద్యావికాస్ నినాదంతో గత నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థు లకు విద్యా సామగ్రిని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు 245 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్, పెన్నులను పంపిణీ చేశామని తెలిపారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనేదే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు జ్యోతి, సమయ, రాజేశ్వరి, మల్లీశ్వరి, అన్నపూర్ణ, శేషుకుమార్, డా. తులసి వెంకట రమణాచార్యులు, పూర్ణచంద్రరావు, పార్థసారధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంసీపల్లి-లక్ష్మాపూర్ ప్రధాన రహదారిపై మున్సిపల్ కార్యాలయం నిర్మించాలని కలెక్టర్‌కు వినతి పత్రం

**శామీర్ పేట్, జులై 06(జనం సాక్షి ):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు మెరుగైన పరి పాలనా సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో,మూడు చింతలపల్లి మున్సిపల్ నూతన కార్యాలయాన్ని ఎంసీ పల్లి-లక్ష్మాపూర్ ప్రధాన రహదారిపై నిర్మించాలని లక్ష్మాపూర్ గ్రామ యువనాయకుడు క్యాతం మధు క్రిష్ణ ఆధ్వర్యంలో మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయాన్ని లక్ష్మాపూర్ రెవెన్యూ పరిధిలో ప్రధాన రహదారికి ఆనుకొని ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తు లో ట్రాఫిక్ రద్దీ, పార్కింగ్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రజలకు సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, లక్ష్మాపూర్ గ్రామ అభివృద్ధికి, వాణిజ్య కార్యకలాపాల విస్తరణకు, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఇది దోహదపడుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదిత ప్రాంతంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందో లేదో పరిశీలించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవిని మర్యాదపూర్వకంగా కలిసి ఇదే అంశంపై ప్రత్యేక వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజల ప్రయోజనాలు, మున్సిపాలిటీ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఎంసీ పల్లి-లక్ష్మాపూర్ ప్రధాన రహ దారిపై మున్సిపల్ కార్యాలయం ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపించాలని కోరారు. ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించి తనవంతు సహకారం అందిస్తానని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చినట్లు క్యాతం మధు క్రిష్ణ తెలిపారు.



# ఉజ్జయిని మహాకాళి ఆలయానికి కొత్త ట్రస్ట్ బోర్డు

**రెండేళ్ల పదవీకాలంతో 14 మంది సభ్యుల నియామిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు**

**ఎక్స్ అఫీషియో మెంబర్‌గా రామ తీర్థ శర్మ**

**సికింద్రాబాద్(జనంసాక్షి):** సికింద్రాబాద్‌లోని ప్రసిద్ధ శ్రీఉజ్జయిని మహాకాళి దేవాలయానికి తెలంగాణ ప్రభుత్వం కొత్త ట్రస్ట్ బోర్డును నియమించింది. తెలంగాణ హిందూ ధార్మిక సంస్థలు, దేవాదాయ ధర్మాదాయాల చట్టం--1987లోని సెక్షన్ 15(2) ప్రకారం మొత్తం 14 మంది సభ్యులతో ట్రస్ట్ బోర్డును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జూలై 3న జి.ఓ.ఆర్.టి. నెం.403ను జారీ చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ సంబంధిత అధికారులకు ఉత్తర్వులు పంపించి అమలకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు వీరే...**

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా శృతి కామేశ్వర్, రాజేంద్ర చక్కల,ఎం.కిరణ్, గుండేల్లి దేవి వరప్రసాద్, మంత్రి సోనాలి, యాదగిర్ శ్రీకాంత్, గౌరపల్లి రమేష్, గంట గీత, గుంటి మల్లికార్జున్, డాక్టర్ కటకంభాస్కర్ గుప్తా,సంజయ్ ప్రకాష్ ఉపాధ్యాయ, ఠాకూర్ హేమంత్ సింగ్, రాకేష్ అగర్వాల్, ఎం.శివకుమార్ లాల్‌లను ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించారు. అదనంగా చట్టంలోని ప్రత్యేక నిబంధన మేరకు రామతీర్థశర్మను ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫీషియో మెంబర్ గా ప్రభుత్వం నియమిస్తూ ప్రభుత్వం ఉత్తరం జారీ చేసింది. వీరంతా ట్రస్ట్ బోర్డు సభ్యులుగా రెండేళ్ల పాటు కొనసాగుతారు. సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన తేదీ నుంచి పదవీకాలం అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సికింద్రాబాద్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ట్రస్ట్ బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం, గోప్యత ప్రమాణం చేయించి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. అలాగే దేవాదాయ శాఖ డైరెక్టర్ తదుపరి పరిపాలనా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**బోనాల జాతరకు ముందే కొత్త ట్రస్ట్ బోర్డు..**

సికింద్రాబాద్ బోనాల మహోత్సవాలకు ముందు ఉజ్జయిని మహాకాళి దేవాలయానికి కొత్త ట్రస్ట్ బోర్డు ఏర్పాటు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆలయ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో ఈ ట్రస్ట్ బోర్డు కీలక పాత్ర పోషించనుంది.

# జాతీయ సమగ్రత కై జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ

**మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ**



**ముషీరాబాద్, జులై 6 (జనం సాక్షి):** దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని, ఆయన చేసిన త్యాగం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ లోని రాంనగర్‌లో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... "ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, ఇద్దరు ప్రధానులు ఉండరాదు" అనే డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ నినాదం దేశ ఐక్యతకు మార్గదర్శకంగా నిలిచిందని దత్తాత్రేయ అన్నారు. భారతీయ జనసంఘ్ రూపంలో ఆయన నాటిన చిన్న విత్తనం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజకీయ పార్టీ అయిన భారతీయ జనతా పార్టీ అనే మహావృక్షంగా ఎదిగిందని పేర్కొన్నారు. దేశభక్తి, జాతీయత, సేవాభావం అనే ఆయన ఆదర్శాలను కోట్లాది కార్యకర్తలు కొనసాగిస్తున్నారని చెప్పారు. 2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ను రద్దు చేయడం ద్వారా డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలను సాకారం చేసిందని అభివర్ణించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన పోరాటానికి అదే నిజమైన నివాళి అని అన్నారు. ప్రస్తుత తరం డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం, దేశభక్తి, త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సాయి కృష్ణ యాదవ్, ఎంసీ మోహన్, కుండిన్య ప్రసాద్, శోభా ఠాకూర్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫెన్సింగ్ వైర్లలో చిక్కుకున్న జింకకు ప్రాణదానం

**ఎన్కేపల్లి గ్రామస్తుల అప్రమత్తతతో సురక్షితంగా రక్షణ**

**గ్రామస్తుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు**




**మోమిన్‌పేట్, జూన్ 6 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం ఎన్కేపల్లి గ్రామ పరిధిలో పంట పొలానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లలో చిక్కుకుని కదలలేని స్థితిలో ఉన్న ఓ జింకను గ్రామస్తులు, అటవీ శాఖ అధికారులు సకాలంలో స్పందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. గ్రామ శివారులోని ఓ వ్యవసాయ చేనుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లలో జింక కాలు చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, అటుగా వెళ్లిన స్థానికులు గమనించి వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అత్యంత జాగ్రత్తగా ఫెన్సింగ్ వైర్ల నుంచి జింకను విడిపించారు. అనంతరం జింకకు ప్రాథమిక చికిత్స అందించి, తదుపరి వైద్య పరీక్షలు మరియు సంరక్షణ కోసం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. గ్రామస్తుల అప్రమత్తత, అటవీ శాఖ అధికారుల వేగవంతమైన చర్యల వల్ల మూగజీవి ప్రాణాలు దక్కాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ ఇనాయత్ అలీ మాట్లాడుతూ.. అడవి జంతువులు ఆహారం, నీటి కోసం గ్రామాల సమీపంలోని వ్యవసాయ పొలాల వైపు వస్తున్న నేపథ్యంలో రైతులు ఏర్పాటు చేసే ఫెన్సింగ్ వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. అడవి జంతువులు కనిపించినప్పుడు వాటికి ఎలాంటి హాని కలిగించకుండా వెంటనే అటవీ శాఖకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# మాజీ శాస్త్రవేత్త డాక్టర్ అజయ్ మాంగ్లిక్‌కు ప్రతిష్ఠాత్మక డీఏఈ రాజారామన్న చైర్ ఫెలోషిప్



**ఉప్పల్/హబ్సిగూడ, జూలై 6 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని హబ్సిగూడ ప్రాంతంలో ఉన్న సీఎస్ఐఆర్-జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్‌జీఆర్ఐ) మాజీ శాస్త్రవేత్త-జి డాక్టర్ అజయ్ మాంగ్లిక్‌కు భారత ప్రభుత్వ అణుశక్తి శాఖ (డీఏఈ) ప్రతిష్ఠాత్మక డీఏఈ-రాజారామన్న చైర్ ఫెలోషిప్ లభించింది. దేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదవీ విరమణ చేసిన శాస్త్రవేత్తలకు మాత్రమే ప్రదానం చేసే ఈ అరుదైన గౌరవాన్ని డాక్టర్ మాంగ్లిక్ మూడు సంవత్సరాల కాలానికి అందుకోవడం ఎన్‌జీఆర్ఐతో పాటు హైదరాబాద్ శాస్త్ర పరిశోధనా రంగానికి మరో మైలురాయిగా నిలిచింది. భారత ప్రభుత్వ అణుశక్తి శాఖ అమలు చేస్తున్న డీఏఈ-రాజారామన్న చైర్ ఫెలోషిప్ దేశంలోని అత్యున్నత పరిశోధనా గౌరవాల్లో ఒకటి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విశేష కృషి చేసి పదవీ విరమణ చేసిన ప్రముఖ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల అపార అనుభవాన్ని దేశ శాస్త్రాభివృద్ధికి వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఫెలోషిప్ ద్వారా ఎంపికైన శాస్త్రవేత్తలు అత్యాధునిక పరిశోధనలను కొనసాగించడంతో పాటు యువ పరిశోధకులకు మార్గనిర్దేశం చేసే అవకాశం పొందుతారు. ఈ ఫెలోషిప్ కింద డాక్టర్ అజయ్ మాంగ్లిక్ ఖండాల ఢీకొనే టెక్టానిక్ ప్రక్రియలు, భూగర్భ నిర్మాణాల పరిణామం, ఉపరితల సమీప ప్రాంతాల భూభౌతిక అన్వేషణకు అవసరమైన విద్యుదయస్కాంత అల్గోరిథంల అభివృద్ధి, వాటి అనువర్తనాలపై ఉన్నత స్థాయి పరిశోధనలు చేపట్టనున్నారు. ఉపరితల సమీప విద్యుదయస్కాంత, మాగ్నెటోటెల్ల్యూరిక్ సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించడం ద్వారా భూగర్భ నిర్మాణాల స్పష్టమైన చిత్రీకరణ, సంక్లిష్ట భౌగోళిక వ్యవస్థలపై మరింత లోతైన అవగాహన కల్పించే పరిశోధనలకు ఆయన నాయకత్వం వహించనున్నారు. ఈ పరిశోధనలు భూగర్భ ఖనిజ వనరుల అన్వేషణ, భూగర్భ జలాల గుర్తింపు, భూకంపాల అధ్యయనం, భూగర్భ నిర్మాణాల విశ్లేషణ, ప్రకృతి విపత్తుల అంచనా, భూవనరుల సమర్థ వినియోగం వంటి కీలక రంగాలకు ఎంతో ఉపయోగపడనున్నాయి. భూగర్భ శాస్త్ర పరిశోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చేయడంలో డాక్టర్ మాంగ్లిక్ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. డాక్టర్ అజయ్ మాంగ్లిక్‌కు ఈ ప్రతిష్ఠాత్మక జాతీయ గౌరవం లభించడం పట్ల హబ్సిగూడలోని సీఎస్ఐఆర్--ఎన్‌జీఆర్ఐ యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. డీఏఈ-రాజారామన్న చైర్ ఫెలోషిప్ కింద ఆయనను తిరిగి సంస్థలోకి ఆహ్వానిస్తూ, ఆయన విశిష్ట అనుభవం, పరిశోధనా నైపుణ్యం యువ శాస్త్రవేత్తలకు స్ఫూర్తినివ్వడంతో పాటు భూగర్భ శాస్త్ర పరిశోధనలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని పేర్కొంది. భారతదేశ భూవిజ్ఞాన సామర్థ్యాలను ప్రపంచస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఆయన పరిశోధనలు విశేషంగా దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. హబ్సిగూడలోని సీఎస్ఐఆర్--ఎన్‌జీఆర్ఐ దేశంలోనే అత్యంత ప్రముఖ భూభౌతిక పరిశోధనా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. భూగర్భ శాస్త్రం, భూకంపాల అధ్యయనం, ఖనిజ వనరుల అన్వేషణ, భూగర్భ జలాల పరిశోధన, భూగోళ నిర్మాణ విశ్లేషణ, సహజ వనరుల అంచనా వంటి అనేక రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట పరిశోధనలు నిర్వహిస్తూ దేశ శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోంది. ఈ నేపథ్యంలో సంస్థ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ అజయ్ మాంగ్లిక్‌కు డీఏఈ-రాజారామన్న చైర్ ఫెలోషిప్ లభించడం సంస్థ ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసిందని శాస్త్రవర్గాలు పేర్కొన్నాయి.

# బాబు జగ్జీవన్ రామ్ ఘన నివాళులు



**నవాబుపేట జూలై 6 (జనంసాక్షి) :** భారత మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానేత బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా నవాబుపేట మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామవెంకట్ రెడ్డి, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, నవపేట్ మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, నవపేట్ స్థానిక సర్పంచి గాజులగూడెం నరసింహారెడ్డి,విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో ఎల్లకొండ సర్పంచ్ కొండల్ యాదవ్, దాన నర్సింలు, ఉపేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి,గోపాలకృష్ణ, బషీర్, పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిపై అచంచల విశ్వాసం

## కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన కానిస్టేబుల్ రవి

### ప్రభుత్వ విద్యపై నమ్మకం మాటల్లో కాదు.. చేతల్లో చూపించిన పోలీస్




**కామారెడ్డి ప్రతినిధి, జూలై 6 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకాన్ని కేవలం మాటల్లో కాకుండా ఆచరణలో చూపించారు ఓ పోలీస్ కానిస్టేబుల్. తన కుమారున్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి సమాజానికి స్ఫూర్తిదాయక సందేశాన్ని అందించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థపై విశ్వాసం ఉంచిన ఆయన నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న బక్కనోళ్ల రవి, తన కుమారుడు బక్కనోళ్ల పృథ్వీక్‌ను తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మూడో తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన అందుబాటులో ఉన్నాయనే విశ్వాసంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. “ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ముందుగా నేనే విశ్వాసం చూపాలి. మన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే సమాజంలో వాటిపై నమ్మకం మరింత పెరుగుతుంది” అని రవి పేర్కొన్నారు. ప్రభుత్వ బడులు అన్ని వర్గాల పిల్లలకు సమాన అవకాశాలు కల్పిస్తూ విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. రవి తీసుకున్న నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్న ఈ సమయంలో తల్లిదండ్రులు అపోహలను వీడి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు. కానిస్టేబుల్ రవి చూపిన ఆదర్శం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని చేతల్లో చూపిన రవి నిర్ణయం, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించే సానుకూల సందేశంగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డికి సీఆర్ఎస్ఐ సిల్వర్ మెడల్

### రసాయన శాస్త్ర పరిశోధనలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం



**సికింద్రాబాద్ (జనంసాక్షి):**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్–ఐఐసీటీ) డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డికి ప్రతిష్ఠాత్మక సీఆర్ఎస్ఐ సిల్వర్ మెడల్ లభించింది. రసాయనశాస్త్ర పరిశోధనల్లో విశిష్ట సేవలు, శాస్త్రీయ నాయకత్వానికి గుర్తింపుగా కెమికల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఆర్ఎస్ఐ) ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది.డాక్టర్ శ్రీనివాస రెడ్డి అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ఆర్గానిక్ కెమిస్ట్ గుర్తింపు పొందారు. సహజ ఉత్పత్తుల సంశ్లేషణ,ఔషధ రసాయన కొత్త ఔషధాల ఆవిష్కరణ రంగాల్లో ఆయన చేసిన పరిశోధనలు రసాయన శాస్త్ర అభివృద్ధికి విశేషంగా దోహదపడ్డాయి. ఇప్పటివరకు 160కు పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించడంతో పాటు అనేక పేటెంట్లు సాధించారు. పరిశ్రమలకు ఉపయోగపడే పలు సాంకేతికతలను అభివృద్ధి చేశారు. సీఎస్ఐఆర్ మిషన్ ప్రాజెక్టుల్లో నూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే ఆయనకు శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం, జె.సి. బోస్ నేషనల్ ఫెలోషిప్ తో పాటు దేశంలోని ప్రముఖ శాస్త్ర అకాడమీల ఫెలోషిప్‌లు లభించాయి. సీఆర్ఎస్ఐ సిల్వర్ మెడల్‌ను రసాయన శాస్త్రంలో అత్యుత్తమ పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలు చేసిన శాస్త్రవేత్తలకు కెమికల్ రీసెర్చ్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రదానం చేస్తుంది. దేశంలో రసాయన శాస్త్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారాల్లో ఇది ఒకటిగా గుర్తింపు పొందింది. డాక్టర్ శ్రీనివాసరెడ్డికి ఈ గౌరవం దక్కడంపట్ల ఐఐసీటీ శాస్త్రవేత్తలు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. భవిష్య త్తులో కూడా రసాయన శాస్త్రం, సాంకేతిక రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలుతెలిపారు.

## హబ్సిగూడలో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి నిర్వహణ

**ఉప్పల్/హబ్సిగూడ, జూలై 6 (జనం సాక్షి):** స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సమానత్వానికి జీవితాంతం కృషి చేసిన మహానేత, భారత మాజీ ఉప ప్రధానమంత్రి దివంగత బాబూ జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి కార్యక్రమాన్ని హబ్సిగూడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. హబ్సిగూడ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి, అలాగే హబ్సిగూడ సిగ్నల్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ మాజీ అధ్యక్షుడు గన్నారం విజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ ధర్మా నాయక్, రామాలయం చైర్మన్ చింతల బాబురావు, నాయకులు మురళీకృష్ణ ముదిరాజ్, గుండు రాజన్న, రాజు నాయక్, గంగా యాదవ్, లక్ష్మీనారాయణ, నర్సింగ్ రావు, ధర్మరాజు, సాయికుమార్, సుమన్ నాయక్, కె. శివ, మహమూద్, శివతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొని బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు.





## తాగునీటి అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపించాలి

### బీఆర్ఎస్ డిమాండ్

**రాజేంద్రనగర్, జూలై6(జనంసాక్షి) :** మణికొండ, నెక్నాంపూర్ డివిజన్లలో తాగునీటి పంపిణీలో జరిగిన అక్రమాలు, అసమానతలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. సోమవారం బీఆర్ఎస్ నాయకులు సీతారం ధూళిపాళ ఆధ్వర్యంలో పలు రిజర్వాయర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు ప్రారంభించినప్పటికీ సకాలంలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడం, జంక్షన్ కనెక్టివిటీ పనుల్లో జాప్యం, పైప్‌లైన్ వ్యవస్థల్లో సాంకేతిక లోపాలు, ట్రంక్ లైన్ల నుంచి నేరుగా బల్క్ కనెక్షన్లు ఇవ్వడం వల్ల నీటి పంపిణీలో అసమానతలు ఏర్పడ్డాయని ఆరోపించింది. ఈ అంశాలపై అధికారులు, కాంట్రాక్టర్ల బాధ్యతను నిర్ధారించి అవసరమైతే బదిలీ అయిన లేదా పదవీ విరమణ చేసిన అధికారులను కూడా విచారణ పరిధిలోకి తీసుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రజలకు సమానంగా తాగునీరు అందే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు సీతారం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్, గుట్టమీద నరేందర్, శ్రీకాంత్, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.

## టెట్ అర్హత మార్కులు తగ్గించాలి



**అంబర్పేట్ జులై 6 (జనంసాక్షి) :** టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) అర్హత మార్కులను తగ్గించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య ప్రభుత్వాన్ని కోరారు. 2025 సెప్టెంబర్ 1న దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం ఇన్ సర్వీస్ లో ఉన్న ప్రతి ఉపాధ్యాయులు టెట్ అర్హత తప్పనిసరి సాధించాలని తెలియజేసింది. ఈ అర్హత పరీక్షలలో నూటికి 60 మార్కులు రావాలని పేర్కొంది, రాష్ట్రంలో సుమారు 50 వేల పై చిలుకు అర్హత సాధించాల్సిన అవసరం ఉంది, అనుభవం కలిగినఉపాధ్యాయులు ఈ అర్హత పరీక్షను సాధించలేకపోతున్నారు. ఈ అర్హత మార్కులు తగ్గించే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నది, కావున బీసీ కేటగిరికి 45 మార్కులు ఎస్సీ కేటగిరి కి 40 మార్కులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని కోరారు .ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అధ్యక్షులు వడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ కు మెమోరండం అందజేశారు.

## శ్యామప్రసాద్ ముఖర్జీ దేశ సమగ్రతకు స్ఫూర్తిదాత : మేకల కీర్తి హర్ష కిరణ్



**సికింద్రాబాద్ (జనం సాక్షి):** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకులు, మహోన్నత దేశభక్తులు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను బౌద్ధనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకురాలు మేకల కీర్తి హర్ష కిరణ్ డివిజన్ నాయకులతో కలిసి ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో మొక్కలను నాటారు. అనంతరం మేకల కీర్తి హర్ష కిరణ్ మాట్లాడుతూ.. ‘ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జండాలు, ఇద్దరు ప్రధానులు ఉండకూడదు’ అనే నినాదంతో కాశ్మీర్ పూర్తి విలీనం కోసం, దేశ సమగ్రత కోసం ముఖర్జీ చేసిన పోరాటం, త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు సాయాదత్తు, హనుమంత ముదిరాజు, మూల అరవింద్, సతీష్ నేతా, శ్యాంరాజ్, భిక్షపతి, సంగం జగదేశ్వర్ నేత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బీరప్పగడ్డ డివిజన్‌లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

## వెంటనే సరిచేయాలని ఏడీఈకి వినతి

**ఉప్పల్, జూలై 6 (జనం సాక్షి):** బీరప్పగడ్డ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ ప్రధాన రహదారిలో బిగ్ బాస్కెట్ హబ్ సమీపంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా కిందకు వేలాడుతూ ప్రజలకు ప్రాణాపాయంగా మారాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ హబ్సిగూడ విద్యుత్ సర్కిల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానికుల ఫిర్యాదుల మేరకు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం. పరమేశ్వర్ రెడ్డి సహకారంతో విద్యుత్ శాఖ అధికారులను కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రధాన రహదారిపై విద్యుత్ తీగలు చాలా కిందకు వేలాడుతూ ఉండటంతో ప్రజలు చేతులు పైకెత్తినా తాకే పరిస్థితి నెలకొందని, దీంతో చిన్నారులు, వృద్ధులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు.



ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలు, తీగలపై చెట్ల కొమ్మలు, తీగజాతి మొక్కలు పెరిగి ఉండటం వల్ల షార్ట్ సర్క్యూట్, విద్యుత్ సరఫరాలో అంతరాయం, అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రమాదం జరగక ముందే అధికారులు అప్రమత్తమై తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను సురక్షితంగా పైకి ఎత్తడంతో పాటు విద్యుత్ స్తంభాలపై ఉన్న చెట్ల కొమ్మలు, తీగజాతి మొక్కలను తొలగించాలని విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతే తమకు ముఖ్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, సంబంధిత శాఖల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.



## బంట్వారం మండలంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**బంట్వారం జులై 6 జనం సాక్షి :** బంట్వారంలో డా.బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్– బాబు జగ్జీవన్ రామ్ కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కమిటీ అధ్యక్షుడు దోరేటి సుధాకర్ మాట్లాడుతూ, సామాజిక న్యాయం సమానత్వం కోసం జగ్జీవన్ రామ్ చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ అర్జీకేలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి



నిజాంపేట్ జూలై 6(జనం సాక్షి) : నిజాంపేట్ కార్పొరేషన్ సర్కిల్ పరిధిలోని నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప లో సోమవారం బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు 31 డివిజన్ అధ్యక్షులు తోట బిక్షపతి, సురేష్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ప్రసాద్, సాంబశివరెడ్డి నాయకులు హాజరై బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బి ఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు జలగం చంద్రయ్య , రామ నరసయ్య కుమార్ రెడ్డి ,శివ గణేష్, ఎండి సాకీర్ ,ఖలీల్ భాయ్ ఎండి మాయినిద్దీన్ వి శ్రీనివాస్ స్వర్ణ కుమారి, పద్మ, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియలో బీఎల్‌వోలకు అండగా బీఎల్‌ఏలు



**రాజేంద్రనగర్, జూలై6(జనంసాక్షి)** : బీఎల్‌వోలకు బీఎల్ఏ 2 వేణుగోపాల్, ఎస్. పెంటయ్య, అరుణ్ కుమార్ సహకారం రాజేంద్రనగర్ పరిధిలోని బూత్ నెంబర్లు 329, 330, 331లో ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ప్రక్రియలో బీఎల్‌వోలకు బీఎల్ఏ--2 గోల్కొండ గోషామహల్ జిల్లా ఇన్చార్జి వై. శ్రీధర్, ఈ. వేణుగోపాల్, ఎస్. పెంటయ్య, అరుణ్ కుమార్ సహకరిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పించారు. మాణిక్యమ్మ కాలనీ, అంబేద్కర్ నగర్ బస్తీల్లో బీఎల్‌వోలు లలిత, లక్ష్మి, శశిరేఖ ఉదయం నుంచి రాత్రి వరకు విధులు నిర్వహిస్తూ ప్రజలు ఇంటికి చేరే వరకు వేచి ఉండి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించారు. ఈ క్రమంలో దాదాపు 80 శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రం ఏబీఎన్ హైస్కూల్‌లో బీఎల్‌వోలు అందుబాటులో ఉండటంతో పాటు ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

## డోకూరి ప్రభాకర్ రెడ్డిని అభినందించిన ఎంపీ మల్లు రవి



**తలకొండపల్లి జూలై 06(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ పార్లమెంటు పరిధిలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలకు క్షేత్రస్థాయిలో వివరించేందుకు, అలాగే మహనీయుల జ్ఞాన చైతన్య బస్సు యాత్ర,ను గత నెల రోజులుగా ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ బస్సు యాత్ర,కు నెల రోజులు బస్సు కేటాయించి అన్ని విధాలుగా సహకరించినందుకు సోమవారం ఎంపీ మల్లురవి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి,ని అభినందించి శాలువతో ఘనంగా సన్మానించారు. ప్రజా పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి,కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారం చేపట్టేందుకు మండల,గ్రామస్థాయిలో పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని డోకూర్ ప్రభాకర్ రెడ్డి,కి సూచించారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలి



**కాప్రా , జులై 6 (జనంసాక్షి) :** డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని బిజెపి పార్టీ సీనియర్ నాయకులు, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, దేశ సమగ్రత, సుపరిపాలనకు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. అనంతరం కీసర ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేసి ఎస్.ఐ.ఆర్. గడువు పొడిగింపు, పారదర్శక అమలు మరియు అక్రమ విదేశీయులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నక్క కిషోర్ గౌడ్, మంచాల మహేందర్, నాగారం డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కర్ర వెంకటేశ్వర్, రామారం గిరి గౌడ్, కార్యదర్శి పొడవుల రవి, రవీందర్ రెడ్డి, సూర్వి రాజు గౌడ్, మధు గౌడ్, కీసర డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజ్ యాదవ్, కొలిచెలిమి కృష్ణ, మెట్టు కృష్ణ యాదవ్, నల్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మూడుసార్లు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డులు పొందిన సి.బేబికి ఘన సన్మానం



**ఖైరతాబాద్, జూలై 06 (జనం సాక్షి)** :విద్యాశాఖ లో 36 సంవత్సరాలకు పైగా సేవలందించి పదవీ విరమణ పొందిన సైన్స్ ఉపాధ్యాయురాలు సి. బేబికి సనత్ నగర్ సుభాష్‌నగర్ వాసులు సోమ వారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమెకు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికను అందజేశారు. 1989లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన సి.బేబి 36 సంవత్సరాలు 8 నెలల పాటు సైన్స్ ఉపాధ్యాయురాలిగా సేవలందించారు . హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా ల్లోని పలు పాఠశాలల్లో విధులు నిర్వహించిన ఆమె, తన విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రభుత్వంచే మూడు పర్యాయాలు ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా సి.బేబి మాట్లాడుతూ.. పదవీ విరమణ అనంతరం కూడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తనవంతు సేవలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె తల్లి సి.సత్యవతి, కాలనీ వాసులు డాక్టర్ విజయ, సురేష్, ఎం.రాధాకృష్ణ, సుధాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## యస్ఐఆర్ ఫారంలను బియల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఇవ్వాలి

**నిజాంపేట్ జూలై 6( జనంసాక్షి) :** సి పి యం గాజులరామారం డివిజన్ కమిటి యస్ ఐ ఆర్ ఫారాలను బి యల్ వో లు ఒక దగ్గరే కూర్చొని ఇసున్నారని దానివల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిపియం గాజులరామారం డివిజన్ కార్యదర్శి జాకీర్ అన్నారు. ఈ మేరకు సోమవారం కుత్బుల్లాపుర్ జోనల్ కార్యాలయం లో జరిగిన ప్రజావాణి లో సిపియం నాయకులు ఈఆర్వో పింకేష్ కి వినతి పత్రం అందజేశారు. . సిపియం సీనియర్ నాయకులు బురాన్ మాట్లాడుతూ యస్ ఐ ఆర్ లో ఓటర్ల పేరు,పోన్ నంబర్లు తప్పులు ఉన్నాయని దానివల్ల ప్రజలు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ముందుగా యస్ ఐ ఆర్ లో ఉన్న తప్పులను సరిచేయాలని కోరారు. అలాగే యస్ ఐ ఆర్ పై ప్రజలకు అవగాహన కలిగించాలని



# ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యమే ప్రజా భద్రతకు పునాది

## జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం - 50 మంది సిబ్బందికి వైద్య పరీక్షలు




**జవహర్ నగర్, జులై 6 (జనంసాక్షి):** ప్రజలకు నిత్యం సేవలందించే ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. డీసీపీ (ట్రాఫిక్, జోన్--1) రాహుల్ రెడ్డి (ఐపీఎస్) చొరవతో రెటినోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శ్రీకార హాస్పిటల్, ఐ ప్లానెట్ ఆప్టిక్స్, పద్మ సాయి డెంటల్, స్కై ఫీట్ ఫిజియోథెరపీ సంస్థల సహకారంతో ఈ శిబిరం జరిగింది. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని 11 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల్లో భాగంగా ఇప్పటికే బేగంపేట, తిరుమలగిరి, అల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో విజయవంతంగా నిర్వహించిన అనంతరం జవహర్‌నగర్‌లో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి, దంత పరీక్షలతో పాటు ఫిజియోథెరపీ సేవలు, రక్తపోటు (బీపీ), ఈసీజీ, రక్తంలో చక్కెర స్థాయిల పరీక్షలను నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది ట్రాఫిక్ పోలీసు అధికారులు, సిబ్బంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్య సూచనలు పొందారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి ట్రాఫిక్ ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ, "ప్రతిరోజూ ఎండ, వర్షం, కాలుష్యం, ట్రాఫిక్ ఒత్తిడిలో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరం. పోలీసుల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరు. అందువల్ల ప్రతి పోలీసు ఉద్యోగి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలి. పోలీసుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఇటువంటి ఆరోగ్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మల్కాజ్‌గిరి ట్రాఫిక్ ఏసీపీ సుబ్బయ్య పర్యవేక్షించగా, జవహర్‌నగర్ ట్రాఫిక్ సీఐ కె. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం గోరింటాకు సంబరాలు

## ఐక్యతకు ప్రతీకగా అక్కంపల్లి గ్రామంలో గోరింటాకు వేడుకలు



**యాలాల జులై 6 ( జనంసాక్షి ) :** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తాండూర్ నియోజకవర్గం యాలాల మండలం అక్కంపల్లి గ్రామంలో కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల కోసం "ఆషాఢం గోరింటాకు" సంబరాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ చైర్‌పర్సన్ కంజర్ల విజయలక్ష్మి యాదవ్ ప్రారంభించారు. తెలంగాణ ఆడబిడ్డల ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు పరిచయం చేయడమే లక్ష్యమని ఆమె తెలిపారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ మహిళలందరు ఒకే వేదికపై సమావేశమయ్యారు. కార్యక్రమంలో భాగంగా మహిళలు గోరింటాకు నూరడం, ఒకరికొకరు గోరింటాకు పెట్టుకోవడం, సంప్రదాయ జానపద పాటలు పాడడం, ఆటలు ఆడడం వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి ఆనందాన్ని పంచుకున్నారని కంజర్ల విజయలక్ష్మి యాదవ్ పేర్కొన్నారు. గ్రామీణ సంస్కృతిని కాపాడుతూ మహిళల్లో ఐక్యత, ఆత్మీయత, సామాజిక బంధాలను మరింత బలోపేతం చేయడమే మా ఫౌండేషన్ సంకల్పం. ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి అని ఆమె అన్నారు. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటేలా ఈ కార్యక్రమానికి గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని ఆమె తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ సంబరాల్లో అక్కంపల్లి సర్పంచ్ ర్యాలపేట లక్ష్మిరాములు, మాజీ జిల్లా కో ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా, దిలీప్ కుమార్, క్రాంతి ప్రకాశ్ గౌడ్, విజయ్, అనిల్ కుమార్ గౌడ్, జగదీష్, నవీన్ గౌడ్, నందకుమార్, పండు, కమలమ్మ పాల్గొన్నారు.

# దేశ సమగ్రత కోసం శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయం

### ఘనంగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి నిర్వహించిన బిజెపి నాయకులు



**రాజేంద్రనగర్, జూలై6 (జనంసాక్షి) :** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా సోమవారం మణికొండ, రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్‌లలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు ఆయన దేశభక్తి, జాతీయవాద భావజాలం, దేశ సమైక్యత కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. "ఏక్ దేశ్ మే దో ప్రధాన్, దో విధాన్, దో నిషాన్ నహీ చలేగా" అనే ఆయన నినాదాన్ని గుర్తుచేస్తూ, దేశ సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మణికొండ డివిజన్ అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్, గోల్కొండ ఇన్‌చార్జి శ్రీధర్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, బొక్క బాల్రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జొన్నాడ సిద్ధప్ప, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చిలుకూరి బీరప్ప, బొక్క బాల్‌రెడ్డి, జి. వినోద్, వెంకటాచారి, కడెం సుధాకర్, విజయకుమార్, జయానంద్ రెడ్డి, వనిత రెడ్డి, గోని శ్రీకాంత్ రెడ్డి, పవన్ కుమార్, మల్లేష్ చారి, సత్యనారాయణ ముదిరాజ్, పగనాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులర్పించారు.



# సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్ జులై 6( జనం సాక్షి) :** కుతుబుల్లాపూర్ నియోజకవర్గం 273వ డివిజన్ నిజాంపేట్ పరిధిలోని కొలన్ నారాయణ రెడ్డి కాలనీలో సీసీ రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, వారు వెంటనే స్పందించి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిధుల ద్వారా రూ.65 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించి, సోమవారం రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాలనీ వాసులు ఆయనకు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాలనీలోని పలు రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి , ప్రజలు సూచించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి అవసరమైన అభివృద్ధి పనులను త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కోట మురళి, బాచుపల్లి అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, మౌళేశ్వర్ రావు, ఇందిరా కడియాల, అసోసియేషన్ సభ్యులు , కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా పోతుగంటి శంకర్



**కడ్తాల్ జులై 06(జనంసాక్షి):** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రంగారెడ్డి జిల్లాలోని పలు మండలాలకు అధ్యక్షులను సోమవారం ప్రకటించింది. కల్వకుర్తి నియోజకవర్గంలోని కడ్తాల్ మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా అన్మాస్ పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపునివ్వడం కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమవుతుందన్నారు. నాయకులు కార్యకర్తల అండదండలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు పోతుగంటి శంకర్ పేర్కొన్నారు.

# ఆమనగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి నియామకం

## ఆమనగల్ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షునిగా అవ్వారి శివలింగం




**ఆమనగల్ జులై 6(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పోలేపల్లి గ్రామానికి చెందిన కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,ని ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. అలాగే ఆమనగల్ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షునిగా అవ్వారి శివలింగం,ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలను అప్పగించిన టీపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు.

# చికిత్స పొందుతున్న కాంగ్రెస్ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే

### మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి జూలై 06(జనంసాక్షి) :** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు ఏదుల శంకర్,కు శనివారం మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో జరిగిన సిఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు వెళ్లారు.సభ జరుగుతున్న సమయంలో మీటింగ్ ప్రాంగణంలోనే అకస్మాత్తుగా క్రింద పడిపోయాడు. వెంటనే స్థానిక నేతలు మహబూబ్ నగర్ ఎస్వీఎస్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.శంకర్ కు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వైద్యులు నిర్ధారించడంతో మెరుగైన వైద్యం అందించేందు కు హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రికి ఆదివారం తరలించారు. విషయాన్ని స్థానిక నేతల ద్వారా తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,గట్టు ఇప్పలపల్లి కాంగ్రెస్ నేతలతో కలిసి సోమవారం నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శంకర్,ను పరామర్శించి,కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.శంకర్ కు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు సూచించారు.పార్టీ పరంగా,వ్యక్తిగతంగాను సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నేతలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు ఆసిఫ్ అలీ,మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గుజ్జుల మహేష్,కాంగ్రెస్ నాయకులు కాకి కృష్ణ,రేణు రెడ్డి,ఏదుల మహేష్,ఏదుల రాజు,ఏదుల మచ్చేందర్,స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# వర్షాల కోసం జుంటుపల్లి ఆలయంలో ఘనంగా సప్త భజన

### భక్తులను సన్మానించిన కంజర్ల విజయలక్ష్మి



**తాండూరు జూలై 6(జనంసాక్షి) :** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు సుభిక్షంగా పండాలని కోరుతూ యాలాల మండలంలోని జుంటుపల్లి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో సప్త భజన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతోంది.అక్కంపల్లి భజన మండలి ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు నిరంతరాయంగా జరుగుతున్న ఈ భజనలో ప్రతిరోజూ పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. రామనామ భజనలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో భాగంగా సామాజిక సేవకురాలు కంజర్ల విజయలక్ష్మి అక్కంపల్లి గ్రామానికి చెందిన భజన భక్తులను ఘనంగా సన్మానించారు. భజన బృందాల సేవ సమాజంలో భక్తి, సాంప్రదాయాల పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని ఆమె అభినందించారు. భక్తులు శ్రీ సీతారామ చంద్ర స్వామిని ప్రత్యేకంగా ప్రార్థించారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండాలని, రైతుల కష్టానికి తగిన ఫలితం లభించి పంటలు పుష్కలంగా పండాలని మొక్కులు చెల్లించారు. తాండూర్ నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ఈ పవిత్ర దేవాలయంలో వర్షాల కోసం నిర్వహించే సప్త భజనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇక్కడ భక్తితో సప్త భజన చేస్తే శ్రీరాముడి కృపతో మంచి వర్షాలు కురుస్తాయని స్థానిక రైతులు, భక్తులు దృఢంగా విశ్వసిస్తారు. ఈ నమ్మకంతోనే ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు చేస్తుంటారు.ఈ కార్యక్రమంలో అక్కంపల్లి సర్పంచు లక్ష్మీ రాములు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, జిల్లా సంఘం అధ్యక్షులు బాబా, మండలి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మురికివాడలకు ఉచిత తాగునీరు అందించాలి: బండి రమేష్



**కూకట్ పల్లి జులై 06 (జనంసాక్షి):** కాలనీలతో పాటు మురికివాడల్లోనూ తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ వాటర్ వర్క్స్ అధికారులను కోరారు. సోమవారం కేపీహెచ్‌బీ వాటర్ వర్క్స్ జీఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) హరిశంకర్‌ను కలిసి సఫ్దర్ నగర్, దీన్ దయాళ్ నగర్, మోతీ నగర్, 15వ ఫేజ్ ప్రాంతాల్లో కొత్త డ్రైనేజీ లైన్ల నిర్మాణం, మోతీ నగర్‌లో వాటర్ సంప్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మురికివాడలకు రోజుకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటిని అందించాలని కోరారు.



# శిల్పకళా వేదికపై జరగనున్న ముఖ్యమంత్రి కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష

**శేరిలింగంపల్లి, జూలై 06 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం శిల్పకళా వేదికపై జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్ల విషయంలో సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, సమాచార మరియు ప్రజాసంబంధాల కమిషనర్ సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం రమేష్, కూకట్‌పల్లి జోన్ డిసిపి రితిరాజ్, అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం), కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ మరియు ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందంతో కలిసి శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పారిశుద్ధ్యం, పరిశుభ్రత, వేదిక నిర్వహణ, లాజిస్టిక్స్, ప్రజా సౌకర్యాలు, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు మరియు ఇతర పౌర సౌకర్యాలపై సమీక్షలో సమగ్రంగా చర్చించడం జరిగింది. కార్యక్రమం విజయవంతంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు మరియు సంబంధిత సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేసి అన్ని ఏర్పాట్లను అనుకున్న సమయానికన్నా ముందుగానే పూర్తి చేయాలని కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు.

## దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే నిజమైన ఓటే పునాది... జగదీశ్వర్ గౌడ్

**శేరిలింగంపల్లి, జూలై 06 (జనంసాక్షి) :** భారతదేశం ఒక అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఇక్కడ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే నిజమైన ఓటు క్రియాశీల పాత్రను పోషిస్తుందని టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వాళిదాసు జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం మదినగూడ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని ప్రజలకు ఓటు నమోదు పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే బలమైన పునాది అని, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలని, స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వాలిదాసు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి ఓటరు నమోదు ఫారాలు పూర్తిగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన వివరాలను నమోదు చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జగదీశ్వర్ గౌడ్ సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించి, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును నమోదు చేసుకునేలా అధికారులు పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని ఆయన తెలియజేశారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా ఎంతో కీలకమని పునరుద్ఘాటిస్తూ ప్రతి ఓటరు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఓటరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని బిఎల్ఓ అధికారులను కోరారు.




# సర్ కార్యక్రమంపై ఇంటింటి ప్రచారం

**జవహర్ నగర్, జులై 6 (జనంసాక్షి):** చంద్రపురి కాలనీ డివిజన్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమంపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సి ఆర్ పి ఎఫ్ అరుంధతి నగర్ బూత్ నంబర్లు 598, 599, 600, 601తో పాటు మల్కారం బూత్ నంబర్ 594 పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు సర్ కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా నాయకులు స్థానిక ప్రజలను కలిసి ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, ఇతర వ్యక్తిగత వివరాలను పరిశీలించుకుని, అవసరమైతే మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం సర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కర్ల పూడి జోగారావు సంతోష్ గుప్తా, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు, సీనియర్ నాయకులు ఓం ప్రకాష్, అశోక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదగిరి, మల్లికార్జున్ గౌడ్, రామ్ చారి, మహేష్ గౌడ్, శీనన్న తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబం సర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను ధృవీకరించుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు తన బాధ్యతను నిర్వర్తించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు.

# అరిస్టాటిల్ పీజీ కళాశాల -వర్కాస్ ఆటోమొబైల్స్ మధ్య అవగాహన ఒప్పందం

**విద్యార్థులకు పరిశ్రమ అనుభవం కల్పించే కార్యక్రమం**

**ఎంబీఏ విద్యార్థులకు నూటయ్యైయ్యి అయిదు రోజుల ఇంటర్న్‌షిప్**

**స్టైపెండ్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు**

**పరస్పర లాభదాయక భాగస్వామ్యం**



మొయినాబాద్, జూలై 6 (జనం సాక్షి): అరిస్టాటిల్ పీజీ కళాశాల, హైదరాబాద్ మరియు ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ వర్కాస్ ఆటోమొబైల్స్ మధ్య విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని అందించేందుకు 'వర్కాస్ అంబాసడర్ కార్యక్రమం' కింద అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై అరిస్టాటిల్ పీజీ కళాశాల తరఫున శ్రీ ఎల్ శ్రీనివాస రెడ్డి, అధీకృత ప్రతినిధి మరియు వర్కాస్ ఆటోమొబైల్స్ తరఫున శ్రీ రామకృష్ణ చారి, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం ఎంపికైన ఎంబీఏ విద్యార్థులకు మొత్తం నూటయ్యైయ్యి అయిదు రోజుల పరిశ్రమ ఆధారిత ఇంటర్న్‌షిప్ నిర్వహించబడుతుంది. ఇందులో మొదటి పదిహేను రోజులపాటు వర్కాస్ ఫ్యాక్టరీ మరియు కంపెనీ షోరూమ్‌లలో సాంకేతిక, కార్పొరేట్ శిక్షణ, అనంతరం తొంబై అయిదు రోజులపాటు ఫీల్డ్ ఇంటర్న్‌షిప్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల మార్కెటింగ్, వినియోగదారుల అధ్యయనం, బ్రాండ్ ప్రమోషన్ మరియు మార్కెట్ విస్తరణ వంటి అంశాలలో ప్రత్యక్ష అనుభవం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, కార్పొరేట్ అనుభవం, నాయకత్వ లక్షణాలు మరియు వృత్తిపరమైన సామర్థ్యాలు అభివృద్ధి చెందే అవకాశం లభిస్తుంది. అర్హత కలిగిన విద్యార్థులకు పరిశ్రమ ప్రమాణాల ప్రకారం నెలవారీ స్టైపెండ్ అందించబడుతుంది. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారికి ప్రతిభ ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించబడతాయి. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థులను పరిశ్రమకు సిద్ధం చేసే దిశగా ఈ అవగాహన ఒప్పందం ఒక కీలక ముందడుగని పేర్కొంది. విద్యార్థులకు నాణ్యమైన పరిశ్రమ అనుభవాన్ని అందించడం ద్వారా వారి ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్కాస్ ఆటోమొబైల్స్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ శ్రీ రామకృష్ణ చారి మాట్లాడుతూ, యువ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు శిక్షణ, మార్గదర్శకత్వం మరియు ప్రాయోగిక అనుభవాన్ని అందించడం ద్వారా ఉత్తమ కార్పొరేట్ నిపుణులుగా తీర్చిదిద్దడమే ఈ భాగస్వామ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం ఒక సంవత్సరం పాటు అమల్లో ఉండి, పరస్పర అంగీకారంతో మరింత కాలం పొడిగించబడుతుంది.